సాక్షి అనంతపురం

శనివారం । 2 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.14 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.14 వేలు పలికాయి.



టమాట కిలో రూ.34

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.34, కనిష్టం రూ.24, సరాసరి రూ.28 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/22.4°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం–సెప్టెంబరు–5)ని పురస్కరించుకుని అందజేసే రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు అర్హులైన టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీఆర్‌ఈఐఎస్, కేజీబీవీ, డైట్ కళాశాల టీచర్లు ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు (మూడు సెట్లు) ఈ నెల 8లోగా సంబంధిత డీవైఈఓ/ఎంఈఓలకు అందజేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను డీవైఈఓలు, ఎంఈఓలు పరిశీలించి రిమార్కులు నమోదుచేసి 12లోగా డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు అనంతపురం బ్లాగ్ స్పాట్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

ఇవీ నిబంధనలు

- కనీసం పదేళ్ల బోధనానుభవం ఉండాలి.
- రాష్ట్రస్థాయికి దరఖాస్తు చేసుకునేవారు గతంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి. గతంలో రాష్ట్రస్థాయి అవార్డు పొందిన వారు అనర్హులు. జాతీయస్థాయి అవార్డుకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా అనర్హులే.
- దరఖాస్తుదారుపై ఎలాంటి క్రిమినల్ కేసులు/ ఆర్టికల్ ఆఫ్ చార్జ్/ శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదు.

ఎఫ్‌ఏ-1 పరీక్షలు వాయిదా

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 4 నుంచి ప్రారంభం కావాల్సిన ఎఫ్‌ఏ-1 (ఫార్మేటివ్ అసెస్‌మెంట్ టెస్ట్) పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసిందని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. వాయిదాపడిన పరీక్షలు ఈ నెల 11 నుంచి 14 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఈ సమాచారాన్ని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, ఆశ్రమ పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు తెలియజేయాలన్నారు. వారందరూ టీచర్లు, విద్యార్థులకు తెలియజేయాలని డీఈఓ ఆదేశించారు.

అందుబాటులో టీటీసీ సర్టిఫికెట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: గతేడాది ఆగస్టులో జరిగిన టీటీసీ-2024 (టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్) పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లు కార్యాలయానికి వచ్చాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ పరీక్షలు రాసిన అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు తీసుకుని పాత డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించి సర్టిఫికెట్లు పొందాలని కోరారు.

పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు



గంగపూజ చేస్తున్న అధికారులు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లోకి హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను శుక్రవారం మళ్లించారు. రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీటి వద్ద డీఈఈ వెంకటరమణ గంగపూజ నిర్వహించారు. తొలి రోజు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డీఈఈ తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.82 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. కృష్ణాజలాల రాకతో రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈలు లక్ష్మీదేవి, ముత్యాలప్ప, గంగమ్మ, రేణుక పాల్గొన్నారు.

నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా రెండు స్టాపింగ్‌లు

గుంతకల్లు: నాందేడ్ – ధర్మవరం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోవెలకుంట్ల, ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్లలో నిలుపుదలకు (స్టాపింగ్) అనుమతిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్ నుంచి ధర్మవరం (07189) ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 6.23 గంటలకు కోవెలకుంట్లకు, 7.30 గంటలకు ప్రొద్దుటూరుకు చేరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ధర్మవరం నుంచి నాందేడ్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 1.58 గంటలకు, కోవెలకుంట్ల రైల్వేస్టేషన్ 3.18 గంటలకు చేరుతుందని తెలిపారు.

తడబడిన తొలి అడుగు

కూటమి సర్కారు ఏడాది పాలనపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపట్టిన 'సుపరిపాలన–తొలి అడుగు' కార్యక్రమం అబాసుపాలైంది. తొలి అడుగు తడబడుతూ నడుస్తోంది. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు జనంలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సాధారణంగా ఎన్నికల ముందు జనంలోకి వెళ్లాలంటే వ్యతిరేకతతో వెళ్లలేకపోతారు. కానీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది తిరక్కుండానే జనం చేత తిరస్కరణకు గురవుతుండటం వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.



అనంతపురంలో రేషన్ కోసం క్యూలో సంచులు పెట్టి పడిగాపులు కాస్తున్న మహిళలు త(ఫైల్)

ఏడాది పాలనపై ఎమ్మెల్యేలకు ఆదరణ కరువు

- మంత్రులు పర్యటనలకు వెళ్లినా స్పందన అంతంతే
- అర్బన్ ప్రాంతాల్లో సమస్యలపై జనం ఏకరువు
- విచ్చలవిడి మద్యం అమ్మకాలపై మహిళల మండిపాటు
- కొన్నిచోట్ల తాగునీటి అవసరాలూ తీర్చలేని పాలనపై ఆగ్రహం

బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ

కూటమి సర్కారు వచ్చిన ఏడాదిలోనే చేసిన మోసాలపై 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలు ఇంటింటా తిరుగుతున్నారు. ఎక్కడికి వెళ్లినా నాయకుల వద్ద సామాన్యులు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. కొత్త పెన్షన్లు లేవు, మద్యం విచ్చలవిడి అయ్యింది, కొత్త రేషన్ కార్డులు లేవు, ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కావడం లేదు.. ఇలా ఒకటి కాదు సవాలక్ష సమస్యలను జనం ఏకరువు పెడుతున్నారు. ఈ కార్యక్రమానికి సామాన్యుల నుంచి బాగా మద్దతు లభిస్తున్నట్టు వెల్లడైంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలున్నాయి. ఇందులో 13 చోట్ల టీడీపీ, ఒక చోట బీజేపీ గెలిచింది. ప్రజాప్రతినిధులు ఏ నియోజకవర్గానికి వెళ్లినా ప్రజలు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. 'సుపరిపాలన' ఎక్కడ చేశారంటూ నిలదీస్తున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తొలి అడుగు కార్యక్రమానికి వెళ్లినప్పుడు రేషన్ సరుకులకు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, గతంలో ఇంటివద్దకే తెచ్చి ఇచ్చేవారని వాపోయారు. కొంతమంది ఇంటిముందే పారుతున్న డ్రెయినేజీ చూపించి మున్సిపాలిటీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మద్యం అమ్మకాలు విచ్చలవిడి అయ్యాయని కొంతమంది మహిళలు వాపోయారు.

మంత్రులకూ నిరసన సెగలే

ఎమ్మెల్యేలకే కాదు మంత్రులు వెళ్లినా నిరసన సెగ తాకుతోంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాయదుర్గం నియోజకవర్గంలో 'తొలి అడుగు' పర్యటనకు వెళ్తుండగా తాగునీటి కష్టాలను ఏకరువు పెడుతూ ఖాళీ బిందెలతో అడ్డుకున్నారు. మాకు తాగునీరు ఇప్పించాలని డిమాండ్ చేశారు. చివరకు అడ్డుకున్నందుకు ఆ మహిళలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులు బెదిరించారు. అంతేకాదు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కళ్యాణదుర్గం రాగా.. కొంత మంది ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలను గృహనిర్బంధం చేశారు. మంత్రి వచ్చినా ఎక్కడా ఎవరినీ కలవకుండానే వెళ్లిపోయారు.

హోం మంత్రి ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు

హోం మంత్రి వంగలపూడి అనిత ఇటీవల మడకశిర నియోజకవర్గానికి వచ్చారు. అక్కడ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలు విని పరిష్కారం సూచిస్తారని అనుకున్నారు. కానీ అక్కడికొచ్చి స్థానిక ఎమ్మెల్యేను పొగిడి అలాగే వెళ్లిపోయారు. దీంతో సమస్యలు విన్నవించుకుందామనుకున్న ప్రజలకు నిరాశే ఎదురైంది. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితదీ ఇదే పరిస్థితి. నియోజవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉంది. కొంతమంది అనుచరులు మాత్రమే మట్టి, ఇసుక దందాలు చేసుకుంటున్నారు. దీంతో సామాన్యులు అల్లాడుతున్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



నవోదయకాలనీలో రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని నవోదయ కాలనీలోని చౌక ధరల దుకాణాన్ని ఆయన సందర్శించి రేషన్ పంపిణీని తనిఖీ చేశారు. రేషన్ పంపిణీపై కార్డుదారులను ఆరా తీశారు. బియ్యంతో పాటు కంది పప్పు కూడా ఇవ్వాలని కార్డుదారులు కోరారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ కార్డుదారులకు కచ్చితమైన తూకంతో బియ్యం ఇవ్వాలన్నారు. తక్కువ తూకం వేస్తే చర్యలు ఉంటాయని డీలర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, వీఆర్‌ఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేయాలి

లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛను పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ స్థానిక నవోదయ కాలనీలో ఉమాదేవి, గుశాంతప్ప ఇళ్లకు వెళ్లి పింఛను అందజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే చెబితే ప్రభుత్వం నుంచి ఏదైనా సహాయం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, తహసీల్దార్ హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

20 వేల మందికి 'సాయం' నిల్!

- గత ప్రభుత్వంలో 2,94,353 మందికి 'రైతు భరోసా' లబ్ధి
- ఈసారి 2,75,049 మందికే 'సుఖీభవ' అంటున్న కూటమి ప్రభుత్వం



అనంతపురం అగ్రికల్చర్: ఎదురుచూపులు, అనేక వాయిదాల అనంతరం అన్నదాత సుఖీభవ పథకం అమలుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటి విడత కింద శనివారం పీఎం కిసాన్ కింద రూ.2 వేలతో పాటు అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు జమ చేస్తామని ప్రకటించింది. అనేక కొర్రీలు వేయడంతో దాదాపు 20 వేల మందికి పెట్టుబడిసాయం దక్కే పరిస్థితి కనిపించడం లేదు.

తొలి ఏడాది రూ.400 కోట్ల ఎగనామం

అధికారంలోకి రాగానే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాగానే ప్లేటు ఫిరాయించారు. అదిగో ఇదిగో అంటూనే 14 నెలలు కాలం గడిపేశారు. ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.14 వేలు ఇస్తామన్నారు. ఈ రూ.14 వేలు ప్రకారం గతేడాది ఇవ్వకుండా జిల్లా రైతులకు ఏకంగా రూ.400 కోట్లకు పైగా ఎగనామం పెట్టారు. ఖరీఫ్–2025 మొదలు కాకముసుపే మేలోనే ఇస్తామన్నారు. తర్వాత తేదీలు మారుస్తూ... ఎట్టకేలకు శనివారం సుఖీభవ కింద మొదటి విడతగా రూ.5 వేలు సొమ్ము వేస్తామని ప్రకటించారు.

లబ్ధిదారుల కుదింపు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో 2,94,353 మందికి 'రైతు భరోసా' కింద పెట్టుబడి సాయం అందించారు. ఇప్పుడు జాబితాలకు కొర్రీలు వేసి 2,75,049 మందికి కుదించారు. అంటే గతంలో కన్నా 19,304 మంది రైతులు జాబితాలో స్థానం కోల్పోయారు. వీరందరికీ సుఖీభవ దక్కే పరిస్థితి లేదు. సాధారణంగా ఏటా రైతుల సంఖ్య, భూమి పాస్‌పుస్తకాల సంఖ్య కొంతైనా పెరుగుతూ ఉంటుంది. ఈ లెక్కన గత ప్రభుత్వంలో కన్నా కొందరు రైతులు పెరగాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా తగ్గించేయడం గమనార్హం. ఈ–కేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ లేదంటూ కొందరు రైతులకు పెట్టుబడిసాయం దక్కే పరిస్థితి లేదు. పీఎం కిసాన్ కింద రూ.2 వేలు చొప్పున రూ.55 కోట్లు, సుఖీభవ కింద రూ.5 వేల ప్రకారం రూ.137.53 కోట్లు... మొత్తంగా రూ.7 వేల ప్రకారం రూ.192.53 కోట్లు మేర పెట్టుబడిసాయం జమ కానుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. రెండో విడత కింద రబీలో కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేలు, అలాగే మూడో విడత కింద జనవరి లేదా ఫిబ్రవరిలో కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం వాటాగా రూ.4 వేలు ప్రకారం జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో గత ప్రభుత్వంతో పోల్చితే మొదటి విడత కింద 19,304 మంది రైతులకు రూ.13.51 కోట్లకు పైగా సొమ్ము దక్కకుండా చేశారు.

ఉపశమనం కాదు.. ప్రత్యక్ష నరకమే

- కాలిన రోగుల హాహాకారాలు
- వార్డుల కేటాయింపులో గందరగోళం
- ఇదీ ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో దుస్థితి



బర్న్స్ వార్డులో ఈఎన్‌టీ రోగులను ఉంచిన దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఉన్నతాధికారుల అవగాహన రాహిత్యం రోగులకు నరకప్రాయంగా మారుతోంది. కోవిడ్ ముందస్తు చర్యల కోసం ఈఎన్‌టీ వార్డును కేటాయించి.. ఇక్కడి రోగులను బర్న్స్ వార్డుకు మార్పు చేశారు. ఇక కాలిన రోగుల వైద్య విభాగం (బర్న్స్ యూనిట్)లో చికిత్స పొందాల్సిన రోగులను సర్జికల్ విభాగంలోని ఎంఎస్ 1, 2, 3, 4, 5, ఎఫ్‌ఎస్ వార్డులకు మార్చారు. ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో ఉపశమనం పొందలేక.. హాహాకారాలు చేస్తున్నారు. కోవిడ్ కేసులు వస్తే చికిత్స అందించేందు కోసం ఖాళీ చేయించిన ఈఎన్‌టీ వార్డును రిజర్వ్ చేశారు. ఇదిలా ఉంటే సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం బర్న్స్ వార్డులోని ఆపరేషన్ థియేటర్ (ఓటీ)ని అనస్తీషియా విభాగానికి కేటాయించడం పెద్ద దుమారం రేపింది. ఈ నిర్ణయంపై సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ రామస్వామి నాయక్ అభ్యంతరం తెలిపారు. కాలిన రోగులకు ఉపయోగపడే ఓటీని మరో విభాగానికి కేటాయించడం సరికాదని, ఇప్పటికే కాలిన రోగులు ఇబ్బందులు పడుతున్నారని లేఖ రాశారు. సూపరింటెండెంట్ సొంత విభాగం ఆర్థో ఓటీలోనే అనస్తీషియాకు స్థలం కేటాయిస్తే బాగుంటుందని పలువురు వైద్యులు పేర్కొంటుండటం గమనార్హం.

ఉక్కపోతతో కాలిన రోగుల అవస్థలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కడైనా ప్రమాదాలు, ఆత్మహత్యాయత్నం చేసుకున్న కాలిన కేసులు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వస్తాయి. అందులోనూ 50 శాతం నుంచి 80 శాతం కాలి ప్రాణాంతకమైన స్థితిలో వస్తుంటాయి. అటువంటి బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.2 కోట్లతో 20 పడకల సామర్థ్యంతో బర్న్స్ వార్డు ఏర్పాటు చేశారు. అందులో అధునాతన ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఏసీ గదులతో వార్డును తీర్చిదిద్దారు. కాలిన కేసులకు మెరుగైన వైద్యం అందించేందుకు సర్జరీ వైద్యులకు ఢిల్లీలో శిక్షణ కూడా ఇచ్చారు. అత్యవసరమైన వార్డును ఈఎన్‌టీకి కేటాయించి, ఈఎన్‌టీ వార్డును ఖాళీగా ఉంచేశారు. సర్జరీ విభాగంలో ఉక్కపోత కారణంగా కాలిన రోగులు విలవిలలాడిపోతున్నారు. ఇప్పటికైనా రోగుల అవస్థలను గుర్తించి ఇదివరకు ఎలా ఉందో అలా సంబంధిత విభాగంలోనే వైద్య సేవలందించాలని పలువురు కోరుతున్నారు. అసంబద్ధ నిర్ణయాలతో రోగుల ప్రాణాలతో చెలగాటమాడవద్దని ఉన్నతాధికారులకు సూచిస్తున్నారు.



ఈ వ్యక్తి పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి. ఎడమచేతికి కాలడంతో సర్వజనాస్పత్రికి వచ్చారు. కాగా ఓపీ నంబర్ 8లో సర్జరీ వైద్యులు చూసి సర్జికల్ వార్డుకు పంపించారు. వాస్తవంగా ఇటువంటి కేసులను బర్న్స్ వార్డులో ఉంచి మెరుగైన వైద్యం అందించవచ్చు. బర్న్స్ వార్డులో ఏసీలతో పాటు బయట వ్యక్తులు ఎవరూ లోపలికి రాకుండా అంతర్గతంగా సేవలందిస్తారు. తద్వారా గాయం త్వరగా మానే అవకాశం ఉంటుంది. ఇలా ఎంతోమంది రోగులు సర్జరీ వార్డుల్లో ఉక్కపోతతో ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

కాలవా.. నీటి కష్టాలు పట్టవా?

- వరుస ఆందోళనలతో అట్టుడుకుతున్న రాయదుర్గం



రాయదుర్గంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రాయదుర్గం టౌన్: ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇలాకాలో తాగునీటి కష్టాలు రెట్టింపయ్యాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు ఖాళీ బిందెలతో తరచూ రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా.. ఇటు అధికారుల్లో కానీ, అటు ప్రజాప్రతినిధుల్లో కానీ ఎలాంటి చలనం లేకపోవడంతో స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. పట్టణంలో కొన్నిచోట్ల వారం రోజులు, మరికొన్ని ప్రాంతాల్లో పది రోజులుగా తాగునీరు అందకపోవడంతో గత నెలలో వరుస ఆందోళనలతో రాయదుర్గం అట్టుడికిపోయింది. తాజాగా శుక్రవారం మరోసారి రాయదుర్గం – బళ్లారి ప్రధాన రహదారిపై బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా 30 వార్డు మహిళలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారం రోజులకు పైగా నీరు సరఫరా చేయకపోతే తామెలా జీవించాలంటూ ప్రశ్నించారు. ఆధ్యాత్మిక ప్రచార ఆశ్రమం ఎదురుగా ఉన్న వీధిలో దాదాపు ఏడాదిగా తాగునీరు సక్రమంగా అందడం లేదని మండిపడ్డారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదని, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు సైతం ప్రజల తాగునీటి కష్టాలు పట్టడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ డీఈ సురేష్, ఎస్‌ఐ ప్రసాద్, నీటి సరఫరా విభాగం సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. ట్యాంకర్లు పంపి నీటి సమస్య పరిష్కరిస్తామని, క్షేత్రస్థాయిలో సమస్య గుర్తించి నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ..శనివారం నుంచి పట్టణంలోని అన్ని కాలనీల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు.

నరకకూపాలుగా వసతిగృహాలు

- కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుల ధ్వజం



హాస్టళ్లలోని సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



ధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు నరక కూపాలను తలపిస్తున్నాయని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ధ్వజమెత్తారు. వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్ ఎదుట ట్రంక్ పెట్టెలు, కంచాలతో ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఎ.రవిచంద్ర హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని మంత్రులు తమ పిల్లలను సంక్షేమ వసతిగృహాల్లో ఉంచి చదివిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుస్తాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం లేదన్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్వహణను విస్మరించడంతో అధ్వానంగా మారాయని ధ్వజమెత్తారు. దోమ తెరలు, చాపలు, పెట్టెలు, దుప్పట్లు, గ్లాసులు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. పారిశుధ్యం లోపించి విద్యార్థులు అనారోగ్యంపాలవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వసతిగృహాలకు ప్రహరీ లేకపోవడంతో ముఖ్యంగా విద్యార్థినులకు రక్షణ కరువై అభద్రతతో ఉన్నారన్నారు. వసతిగృహాల నిర్వహణకు రూ.143 కోట్లు కేటాయించామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయులు ప్రకటించారన్నారు. ఆ నిధులు విడుదల చేశారా..? చేసి ఉంటే ఎక్కడ ఎంత ఖర్చు చేశారో చెప్పగలరా..? అంటూ నిలదీశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు 27 రకాల వస్తువులు ఇవ్వాల్సి ఉన్నా అమలు కాలేదన్నారు. అనంతరం డీఆర్‌ఓ మలోలను ఆయన చాంబర్‌లో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాకు వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడు దేవేంద్ర హాజరై మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎండీ సుల్తాన్, వంశీయాదవ్, బీసీసెల్ రాష్ట్ర నాయకులు గోగుల పుల్లయ్య, విద్యార్థి విభాగం నియోజకవర్గాల అధ్యక్షులు కైలాష్, కాశీ, మనోజ్, సాకే పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్‌రెడ్డి, వెంకట, జిల్లా ప్రధాన కార్యదర్శులు నిశాంత్‌రెడ్డి, ఆశోక్, కార్యదర్శులు హరినాథరెడ్డి, మహేష్‌నాయక్, నగర నాయకులు అంజన్‌రెడ్డి, ఫయాజ్, రాహుల్‌రెడ్డి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పాతకొత్త చెరువులో నెమళ్ల సందడి



ఇంటి వద్ద సంచరిస్తున్న నెమలి

గుంతకల్లు రూరల్: మండలంలోని పాత కొత్త చెరువు (పీకేచెరువు) గ్రామంలో నెమళ్ల సందడి నెలకొంది. స్థానికులకు అలవాటు పడిన కొన్ని నెమళ్లు తరచూ ఆహారం కోసం అటవీ ప్రాంతానికి వెళ్లి సాయంత్రానికి గ్రామానికి చేరుకుంటున్నాయి. వీటికి తోడు అటవీ ప్రాంతంలోని నెమ్మళ్లు సైతం వచ్చి వెళుతుండడంతో గ్రామంలో ఎటు చూసినా నెమళ్లు కనిపిస్తున్నాయి. అంతేకాక వ్యవసాయ పనులు, గొర్రెల మేపు తదితర పనుల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లిన రైతులు అక్కడ నెమలి గుడ్లు కనిపిస్తే తెచ్చి ఇంట్లో కోళ్ల కింద పొదిగేసి నెమళ్ల సంతతి పెరిగేలా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

కిలో బంగారు ఆభరణాల సీజ్



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నగదుతో పోలీసులు

తాడిపత్రి టౌన్: మండలంలోని కడప రోడ్డులో గురువారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టిన సమయంలో కిలో బరువున్న బంగారు నగలతో పాటు రూ.1.48 లక్షల నగదు పట్టుబడింది. సరైన అనుమతి పత్రాలు లేకుండా తాడిపత్రి నుంచి ప్రొద్దుటూరుకు కారులో నగలు, నగదు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రొద్దుటూరుకు చెందిన నగల వ్యాపారి ఉభయ్‌దుల్లాతో పాటు ఆయన ఇద్దరు కుమారులు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, దాదాపు 1,123.92 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,48,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తు, నగదును కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

రైల్వే క్వార్టర్స్‌లో చోరీ

రాయదుర్గం టౌన్: స్థానిక నూతన రైల్వే క్వార్టర్స్‌లో చోరీ జరిగింది. రైల్వే టీఆర్‌డీ (ట్రాక్షన్ అండ్ రిసోర్స్ డెవలప్‌మెంట్) వర్కర్‌గా పనిచేస్తున్న నాగేంద్ర ఇంత కాలం తాను అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి క్వార్టర్స్‌లో కేటాయించిన నూతన ఇంటికి గురువారం మొత్తం సామగ్రిని తరలించారు. అనంతరం శుక్రవారం నూతన గృహంలో చేరాలని అనుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అద్దె ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలసి నిద్రించారు. ఇదే అదనుగా భావించిన దుండగులు క్వార్టర్స్‌లోని ఇంటి తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బ్యాగుల్లోని బంగారు, వెండి సామగ్రితో పాటు కొంత మేర నగదు అపహరించారు. శుక్రవారం ఉదయం నూతన గృహంలో పూజాదికాలు చేసేందుకు సిద్ధమై వచ్చిన నాగేంద్ర కుటుంబ సభ్యులు చోరీ విషయాన్ని గుర్తించి ఆందోళనకు గురయ్యారు. మొత్తం రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు కొంత నగదు అపహరించినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లాలో పోలింగ్ కేంద్రాల పెంపు

- హేతుబద్ధీకరణతో కొత్తగా 330 కేంద్రాలు
- అత్యధికంగా అనంతపురంలో 70
- అత్యల్పంగా కళ్యాణదుర్గం, శింగనమలలో 21 చొప్పున కేంద్రాలు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తరువాత జిల్లాలో కొత్తగా 330 కేంద్రాలు పెరిగినట్లు డీఆర్‌ఓ మలోల తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల కమిషన్ కొత్తగా జారీ చేసిన నిబంధన ప్రకారం పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,200 మంది ఓటర్ల ఉండాలన్నారు. అంతకు మించి ఓటర్లు ఉంటే అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 2,226 పోలింగ్ కేంద్రాలు ఉండగా హేతుబద్ధీకరణ తరువాత 330 పెరిగి కేంద్రాల సంఖ్య 2,556కు చేరినట్లు వివరించారు.

రెండు కిలోమీటర్ల పరిధిలోనే

ప్రస్తుతం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలన్నీ ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయని, వీటికి రెండు కిలోమీటర్ల పరిధిలోనే కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. ఇందుకు సంబంధించి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు తెలపాలని కోరుతూ పరిశీలనార్థం కొత్త పోలింగ్ కేంద్రాల జాబితాను నియోజకవర్గ స్థాయిలో ఆయా పార్టీల ప్రజాప్రతినిధులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి సానుకూలత వచ్చిన తర్వాత జిల్లాస్థాయిలో తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఇక పోలింగ్ కేంద్రాల మార్పునకు 48, కేంద్రం పేరు మార్పునకు 7 ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వీటిని ఆమోదం కోసం జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి పంపనున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు అమర్‌నాథ్‌రెడ్డి, రాధాకృష్ణ, టీడీపీ నారాయణస్వామి, బీజేపీ ఈశ్వరప్రసాద్, జనసేన కిరణ్‌కుమార్, ఐఎన్‌సీ ఇమామ్‌వలి, సీపీఎం బాలరంగయ్య, ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్‌వలి, ఈఆర్‌ఓలు కేశనాయుడు, తిప్పేనాయక్, రమేష్‌రెడ్డి, మల్లికార్జునుడు, రామ్మోహన్, కో–ఆర్డినేషన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, ఈడీటీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు (పీఎస్‌లు) ఇలా..

నియోజకవర్గం	ప్రస్తుతం	పెరిగినవి	మొత్తం
రాయదుర్గం	296	47	343
ఉరవకొండ	260	26	286
గుంతకల్లు	276	71	347
తాడిపత్రి	274	47	321
శింగనమల	293	21	314
అనంతపురం	285	70	355
కళ్యాణదుర్గం	261	21	282
రాప్తాడు	281	27	308
మొత్తం	2,226	330	2,556

యువకుడి బలవన్మరణం



మృతుడు రాజ్‌కుమార్

గుమ్మఘట్ట: తాగుడుకు బానిసైన ఓ యువకుడు వ్యసనాన్ని మానలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన హరిజన తిప్పేస్వామి, గీతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. వ్యవసాయంతో జీవనం సాగించేవారు. పెద్ద కుమారుడికి వివాహమైంది. ఈ క్రమంలో రెండో కుమారుడు రాజ్‌కుమార్ (24)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే ఏ ఒక్కటీ కుదరకపోవడంతో రాజ్‌కుమార్ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో పలుమార్లు తల్లిదండ్రులు మందలించినా అతనిలో మార్పు రాలేదు. తాగుడుకు బానిసైన తనకు ఇక పెళ్లి కాదని భావనలో క్షణికావేశానికి లోనై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు రాయదుర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక రాజ్‌కుమార్ మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రంపం కోసుకుని వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: ప్రమాదశాత్తు రంపం కోసుకుని ఖాసీం వలి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గుత్తి ఆర్ఎస్‌లోని బీసీ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. తన ఇంటికి వేసిన రేకులను సరి చేయడానికి రంపంతో కోస్తుండగా చేజారి పొట్టపై పడింది. ఎలక్ట్రిక్ రంపం కావడంతో పొట్ట కోసుకుపోయింది. విపరీతంగా రక్తస్రావం అవుతుండడంతో క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మీ చేతనైంది చేసుకోండి!

- ఉన్నతాధికారులపై తిరగబడిన పీఆర్ ఇంజినీర్
- పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో హల్‌చల్

అనంతపురం సిటీ: 'మీ చేత ఏమైతే అది చేసుకోండి. బదిలీ చేయిస్తారా? లేక సరెండర్ చేయిస్తారా? మీకంత పలుకుబడే ఉంటే రండి.. చూసుకుందాం' అంటూ ఓ మండల ఇంజినీర్ తన ఉన్నతాధికారులపై తిరగబడిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఓ ఇంజినీర్ అనంతపురానికి కూతవేటు దూరంలో ఉన్న మండలంలో పనిచేస్తున్నారు. ఇటీవల ఆ మండలంలో చేసిన రోడ్డు పనులకు సంబంధించి చివరి బిల్లులు చేసే నేపథ్యంలో పనిలో నాణ్యతను పరిశీలించేందుకు అవసరమైన శాంపిల్స్‌ను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సేకరించారు. వీటిని ల్యాబ్‌లో పరీక్షించేందుకు రావాలని సదరు ఏఈకి కబురు పెట్టారు. అయితే అదిగో వస్తున్నా.. ఇదిగో వస్తున్నానంటూ రాకుండా రెండ్రోజులు ఆలస్యంగా కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్యాంపునకు వెళ్లి అప్పుడే వచ్చి సీటులో క్యూసీ విభాగం ఈఈపై ఏఈ చిందులు తొక్కుతూ ఇష్టానుసారంగా మాట్లాడినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. అంతటితో ఆగక ఈఈ, డీఈఈలను లెక్క లేకుండా బెదిరింపు ధోరణితో మాట్లాడుతూ పూనకం వచ్చిన వాడిలా హల్‌చల్ చేయడం వివాదాస్పదమైంది. ఇప్పటికే సదరు ఏఈ తీరుపై పలుమార్లు పత్రికల్లో కథనాలు రాగా.. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ కూడా సీరియస్ అయినట్లు తెలుస్తోంది. అయినా అతనిలో మార్పు రాకపోగా.. మరింత బరితెగించినట్లు పీఆర్ ఉద్యోగులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుడ్డు.. వెరీ బ్యాడ్

- పాఠశాలలు, అంగన్‌వాడీలకు నాసిరకం గుడ్లు సరఫరా



గుంతకల్లులోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో కుళ్లిపోయిన కోడిగుడ్లు



చిన్న సైజు గుడ్డును చూపుతున్న విద్యార్థి

గుంతకల్లుటౌన్/తాడిపత్రిరూరల్: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లలో నాణ్యత లోపించింది. 25 శాతం కుళ్లిపోయిన, చిన్న సైజు గుడ్లను అందజేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పాఠశాలల్లో కొందరు విద్యార్థులైతే మధ్యాహ్న భోజనంలో అందజేస్తున్న కోడిగుడ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గుంతకల్లు పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో సుమారు 1,350 మంది విద్యార్థులు ఉండగా..వారానికి ఆరు వేల గుడ్ల వరకు అందుతున్నాయి. వీటిలో 300 దాకా పగిలిన, కుళ్లిపోయిన గుడ్లు వస్తున్నాయి. కొన్ని కోడిగుడ్ల బరువు 30 గ్రాములు మాత్రమే ఉంటోంది. శుక్రవారం ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా.. గుడ్లు నాణ్యత లేని విషయం వెలుగులోకి వచ్చింది. మంచి ప్రభుత్వమని చెప్పుకునే కూటమి సర్కారు నాసిరకమైన గుడ్లను సరఫరా చేస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతోందని, నాసిరకం గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. కొన్ని డ్యామేజీ, చెడిపోయిన గుడ్లు సరఫరా అవుతున్న మాట వాస్తవమేనని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిబాబు తెలిపారు. ఈ అంశంపై ఎంఈఓకు లేఖ రాశామన్నారు. గుడ్ల నాణ్యతపై విద్యార్థులను విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని గుంతకల్లు ఎంఈఓ మస్తాన్ రావు చెప్పారు.

అంగన్‌వాడీ గుడ్లలో కోత!

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లలో కోత పెడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ప్రతి నెలా నాలుగు విడతలుగా దాదాపు 4.28 లక్షల కోడిగుడ్లను సరఫరా చేయాలి. కానీ జూలైలో మూడు, నాల్గవ విడతగా ఇవ్వాల్సిన 2.9 లక్షల గుడ్లను సరఫరా చేయలేదు. అలాగే ఈ ఏడాది మార్చిలో 20,060, ఏప్రిల్‌లో 17,068, మేలో 55,717, జూన్‌లో 59,359 గుడ్లు సరఫరా కాలేదని అంగన్‌వాడీ సిబ్బందే చెబుతున్నారు. అరకొర గుడ్ల సరఫరా, సైజులో వ్యత్యాసంపై ఇప్పటికే పై అధికారులకు నివేదిక పంపామని ఐసీడీఎస్ తాడిపత్రి ప్రాజెక్టు సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. పైనుంచి గుడ్లు సరఫరా కావడం లేదని కాంట్రాక్టర్ అంటున్నారన్నారు.

ఇన్నోవేషన్ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీకి చర్యలు

అనంతపురం అర్బన్ : జేఎన్‌టీయూలో ఏర్పాటు చేయనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో ఉద్యోగాల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ రాష్ట్ర ప్రభుత్వ ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌కు తెలిపారు. సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని చెప్పారు. ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్న జిల్లాల కలెక్టర్లతో ఐటీ కార్యదర్శి శుక్రవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఆయనతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఇతర అధికారులు ఉన్నారు. సెంటర్ గురించి పరిశ్రమలు, విద్యా సంస్థలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీఈ వి.రాజగోపాల్, నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాపరెడ్డి, ఆర్అండ్‌బీ జేసీ బాలకాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

తేలు కుట్టి యువకుడి మృతి



శివ (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని దంచర్ల గ్రామానికి చెందిన కొట్టం రామాంజనేయులు కుమారుడు శివ (30) తేలు కుట్టడంతో మృతిచెందాడు. వ్యవసాయ పనులతో కుటుంబానికి చేదోడుగా ఉన్న శివకు 18 నెలల క్రితం వివాహమైంది. శుక్రవారం పొలం పనులు చేస్తున్న సమయంలో తేలు కుట్టింది. గుర్తించిన బాధితుడు వెంటనే తేలును చంపేశాడు. నొప్పి ఎక్కువగా ఉండడంతో ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు తెలపడంతో వారు గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో చికిత్స అందేలోపు శివ మృతి చెందాడు.

నాసిరకం విత్తనంతో నష్టపోయాం

- ఫర్టిలైజర్ షాప్ ఎదుట రైతుల ధర్నా



కళ్యాణదుర్గంలోని అన్నదాత ఫర్టిలైజర్ షాప్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కళ్యాణదుర్గం రూరల్: నాసిరకం విత్తనంతో నష్టపోయినట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ కళ్యాణదుర్గంలోని అన్నదాత ఫర్టిలైజర్ షాప్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. శెట్టూరు మండలం మాలేపల్లి గ్రామానికి చెందిన 20 మంది రైతులు కళ్యాణదుర్గంలోని అన్నదాత ఫర్టిలైజర్ షాప్‌లో మొక్కజొన్న విత్తనాలు తీసుకుని, సాగు చేపట్టినట్లు తెలిపారు. పంట కాలం పూర్తయిన తర్వాత దిగుబడి తామే కొనుగోలు చేస్తామంటూ రైతులకు ఉచితంగా విత్తనాలను పంపిణీ చేశారన్నారు. ఆ తర్వాత పెట్టుబడి, మందుల కోసం ఒక్కొక్క రైతు నుంచి రూ.70 వేలు వసూలు చేసుకున్నారని వివరించారు. అయితే ఫర్టిలైజర్ నిర్వాహకులు నాసిరకం విత్తనం ఇవ్వడంతో పంట పూర్తిగా ఎత్తిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే విషయాన్ని పలుమార్లు ఫర్టిలైజర్ నిర్వహకులకు తెలిపిన ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. దీంతో పంట నష్టానికి పరిహారం చెల్లించాలంటూ శుక్రవారం ఫర్టిలైజర్ షాప్ ఎదుట నిరసన చేపడితే.. యజమాలు దుకాణాన్ని మూసి అజ్ఞాతంలోకి వెళ్లారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారులు అక్కడకు చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులతో మాట్లాడి.. రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

అడ్డగోలు నియామకాలను రద్దు చేయాలి

- వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అడ్డగోలుగా చేపట్టిన ఎంఈఓల నియామకాలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను ప్రభుత్వ, పీఆర్ హెచ్‌ఎంల ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా భర్తీ చేయాల్సి ఉందన్నారు. అలా కాకుండా కేవలం ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని మండిపడ్డారు. ఇది పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులకు జరిగిన తీరని అన్యాయంగా భావిస్తున్నామన్నారు. అడ్డగోలుగా నియామకాలను వెంటనే రద్దుచేసి మళ్లీ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే శనివారం ఫ్యాప్టో తలపెట్టిన కార్యక్రమానికి వైఎస్సార్‌టీఏ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, రాష్ట్ర, జిల్లా నాయకులు గోవిందరెడ్డి, రవీంద్రారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, గంగాధర్ రెడ్డి వెంకటరమణ, గోపాల్, ఎస్. వెంకటరెడ్డి, కృష్ణా నాయక్, సిద్ధ ప్రసాద్, రామకృష్ణ, విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

'ఆ టీచర్ మా కొద్దు'



ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ముదిగుబ్బ: మండలంలోని బ్రహ్మదేవరమర్రి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వి. రోజారాణి తమకొద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి కేటాయించిన ఉపాధ్యాయురాలు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. సమయపాలన పాటించడం లేదన్నారు. పాఠశాలలోనే నిద్ర పోతుంటారన్నారు. గ్రామస్తులు ప్రశ్నిస్తే మా ఆయన పోలీస్, మీపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుతానంటూ బెదిరింపులకు దిగుతోందని వాపోయారు. ఇలాంటి ఉపాధ్యాయులతో తమ పిల్లల విద్యాభివృద్ధి కుంటుపడుతుందని, ఆమెను బదిలీ చేసి, మరో ఉపాధ్యాయుడిని నియమించాలంటూ కోరారు. దీనిపై స్పందించిన ఎంఈఓ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

హిందూపురం టౌన్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక జీఆర్పీ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ధర్మవరం జీఆర్పీ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ సజ్జప్ప, ధర్మవరం ఆర్పీఎఫ్ ఎస్ఐ రోహిత్ గౌడ్, హిందూపురం ఎస్ఐ సాయినాథరెడ్డి వెల్లడించారు. రైళ్లలో చోటు చేసుకున్న చైన్‌స్నాచింగ్‌లకు సంబంధించి కేసులు నమోదు చేసిన రైల్వే పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం హిందూపురంలోని రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం 2లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఒడిశాలోని బారకం గ్రామానికి చెందిన బినోత్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చైన్‌స్నాచింగ్‌ల అంశం వెలుగు చూసింది. ధర్మరం సర్కిల్ పరిధిలోని హిందూపురం ఆర్‌పీఎస్‌లో మూడు కేసులు, ధర్మవరం ఆర్‌పీఎస్‌లో రెండు కేసులు, కదిరి ఆర్‌పీఎస్‌లో ఒక కేసులో నిందితుడిగా గుర్తించి 75 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

అక్కాతమ్ముడిపై దాడి

రాప్తాడు రూరల్: రస్తా విషయంగా చోటు చేసుకున్న వివాదంలో అక్క, తమ్ముడిపై దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. సోములదొడ్డి గ్రామానికి చెందిన కె.నారాయణరెడ్డికి కుమారులు కె.రామసుబ్బారెడ్డి, కె.బ్రహ్మానందరెడ్డి, కుమార్తె కమలమ్మ ఉన్నారు. వీరు నివాసం ఉంటున్న ఇంటి పక్కనే 22 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. వీరి ఇంటి వెనుక నాగిరెడ్డి, రామలక్ష్మి, మదన్‌మోహన్‌రెడ్డి కుటుంబాలు ఉన్నాయి. నారాయణరెడ్డికి చెందిన 22 సెంట్ల స్థలంలో నుంచే ఆ ఇళ్లకు దారి ఉందంటూ ఆ కుటుంబాలు కొద్ది రోజులుగా గొడవ చేస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఖాళీ స్థలంలో పెరిగిన కంపచెట్లను తొలిగించేందుకు నాగిరెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, రామలక్ష్మి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు కొడవళ్లు, గొడ్డళ్లతో వెళ్లారు. సమాచారం అందుకున్న నారాయణరెడ్డి కుమారులు రామసుబ్బారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కమలమ్మ వెళ్లి అడ్డుకున్నారు. తమ స్థలంలో ఎందుకు చెట్లు తొలగిస్తున్నారంటూ ప్రశ్నించడంతో వివాదం చెలరేగింది. ఆ స్థలం తమదంటూ మారణాయుధాలతో నాగిరెడ్డి కుటుంబసభ్యులు దాడికి పాల్పడ్డారు. గొడ్డలితో దాడి చేయడంతో కమలమ్మ, బ్రహ్మానందరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. రామసుబ్బారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంతలో గ్రామస్తులు జోక్యం చేసుకుని సర్దిచెప్పి పంపారు. గాయాలపాలైన కమలమ్మ, బ్రహ్మానందరెడ్డి, రామసుబ్బారెడ్డిని సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాద్రీశుడికి ప్రత్యేక పూజలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఆలయ అధికారుల తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

బయటపడిన డొల్లతనం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. జగనన్న విద్యా కానుక పేరుతో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్, బూట్లు, ఇతర సామగ్రి ఏటా ఉచితంగా పంపిణీ చేశారు. అయితే ఈ పథకంతో భారీగా ప్రజాధనం వృథా అవుతోందని, నాసిరకం కిట్లను పంపిణీ చేస్తున్నారని అప్పటి ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపణలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన కిట్‌ను అందజేస్తామని గొప్పలకు పోయారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థులకు అందజేసిన కిట్లలోని డొల్లతనం కాస్త బయటపడింది. విద్యార్థులకు అందజేసిన బ్యాగ్‌లు రెండంటే రెండే రోజుల్లో చిరిగిపోయి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కూటమి ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ బ్యాగులు నాణ్యతగా లేవని చూపుతున్న అనంతపురంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

క్లుప్తంగా

దళిత విద్యార్థులకు అవకాశం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏపీఎస్ఎస్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునేందుకు దళిత విద్యార్థులకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఏపీ మాదిగ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గురుకులాల సమన్వయ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు రమణ మాట్లాడుతూ.. పేద దళిత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని దళిత సంఘాల నాయకులు అందజేసే వినతులను పరిశీలించి ఆయా విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాదిగ విద్యార్థి సంఘం నాయకులు ఓబులేసు, నగేష్, శివశంకర్, సత్యమ్మ, పక్కీరప్ప పాల్గొన్నారు.

రేపు ఉరవకొండలో యోగా పోటీలు

అనంతపురం కల్చరల్: యోగాసనా అసోసియేషన్ ఆఫ్ అనంతపురం తరఫున ఈ ఏడాది యోగసనా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశామని వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని షిరిడి నగర్ యోగా కేంద్రంలో జరిగిన సమావేశంలో రాజశేఖరరెడ్డి, దివాకర్, రవికాంత్ రమణ తదితరులు యోగా పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈనెల 3న ఉరవకొండలోని జెడ్పీ స్కూల్ వేదికగా పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లా విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అటువంటి వారు జాతీయ అవకాశాలను యోగా వారధిగా పొందవచ్చన్నారు. ఖేల్ ఇండియా, అస్మితా గేమ్స్, ఉమెన్‌లీగ్ తదితర పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఇస్తారన్నారు. జాతీయ స్థాయి వరకు వెళ్లే వారికి ఏషియన్ ఒలింపిక్ గేమ్స్‌లో అవకాశం కల్పిస్తారన్నారు. జూనియర్, సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు 10 నుంచి 55 ఏళ్ల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు.

సజావుగా వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మణరావు, ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో జరిగిన వేలంలో సుమారు 20 మంది వరకూ వేలంపాటదారులు పాల్గొన్నారు. కాగా.. ఈ వేలంలో 7 వాహనాలు అమ్ముడుపోయాయి.


రాజశేఖర్ సేవలు ఆదర్శం



ఉప ఖజానాధికారి రాజశేఖర్ దంపతులను సన్మానిస్తున్న ట్రెజరీ అధికారులు

అనంతపురం అర్బన్: ఉప ఖజానాధికారి జీవీ రాజశేఖర్ నిబద్ధత కలిగిన అధికారి. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో అందించిన సేవలు ఆదర్శమని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. జిల్లా ఖజానాలో ఉప ఖజానాధికారిగా ఉన్న రాజశేఖర్ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేశారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో రాజశేఖర్ దంపతులకు ఖజానాశాఖ ఉద్యోగులు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాజశేఖర్ మృదుస్వభావి, స్నేహశీలి అన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారన్నారు. శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారావు, ఏటీఓ రాణి, ట్రెజరీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర నారాయణ, మహేశ్వరరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఫరూక్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కిషోర్ చౌదరి, రాష్ట్ర నాయకులు జగదీష్, విశ్వనాథ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎస్‌టీఓలు శ్రీనివాసరావు, తిరుమలరెడ్డి, శ్రీనివాస్, సుమనలత, రాజేష్, బోయపాటి అనంతయ్య, సాధిక్, షబానా, శివారెడ్డి పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మికి డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ విభాగంలో పరిశోధన చేసిన మారక రాజ్యలక్ష్మికి శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు పర్యవేక్షణలో 'అనంతపురం జిల్లాలో వేరుశనగ సాగు చేస్తున్న రైతుల ఆత్మహత్యలకు గల కారణాలు.. ఆత్మహత్య నివారించే దిశగా తీసుకోవాల్సిన చర్యలు.. అన్నదాతకు అందించాల్సిన పథకాల వివరాలపై సమగ్రంగా పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

అభివృద్ధి పనులకు గ్రహణం



ఆగిపోయిన బి.యాలేరు ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు

ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామంలోని ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. పనులు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థకు పెద్దపీట వేశారు. నాడు–నేడు పేరుతో పాఠశాలల్లో అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరు చేశారు. భవనాల నిర్మాణం, విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. అంతేకాకుండా పాఠశాలకు ప్రహరీ సరిగా లేకపోవడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పాఠశాల ఆవరణలో మద్యం సేవించి సీసాలను పడేసి వెళ్తున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఆత్మకూరు:

ముళ్ల కంపలు తొలగించరూ..



రోడ్డుపైకి అడ్డంగా వచ్చిన కంప చెట్లు

రాప్తాడు పంచాయతీలోని ముస్లిం మైనార్టీ కాలనీ నుంచి ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలోకి వెళ్లే దారికి ఇరువైపులా ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. ముస్లిం మైనార్టీ కాలనీలో మండల సమాఖ్య కార్యాలయం ఉండటంతో ప్రసన్నాయపల్లి, చిన్మయ నగర్, ఇందిరమ్మ కాలనీ, కళాకారుల కాలనీ, రాజ రాజేశ్వరి కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, వైఎస్సార్ జగనన్న కాలనీల నుంచి మహిళలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కంప చెట్లు గుబురుగా ఉండటంతో మహిళలు భయపడుతున్నారు. కంప చెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. అధికారులు వెంటనే స్పందించి కంప చెట్లను తొలగించాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు.

– రాప్తాడు:

ప్రజాదరణ ఓర్వలేక కుట్రలు

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక సీఎం చంద్రబాబు నాయుడు అండ్ కో కుట్రలకు పాల్పడుతున్నారు. ఎలాగైనా ఆంక్షలు విధించి ప్రజలను కలవనివ్వకూడదని చూస్తున్నారని మేయర్ వసీం పేర్కొన్నారు. నెల్లూరులో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు కూటమి ప్రభుత్వం, పోలీసుల ఆంక్షలను తప్పుబట్టారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. వ్యవస్థలను స్వాధీనం చేసుకుని అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలవనివ్వకుండా ఉండేందుకు గ్రామాల్లో రోడ్లను జేసీబీలతో తవ్వడం దారుణమన్నారు. ఎమర్జెన్సీని తలపించేలా సీఎం చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని.. రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు.

అదనపు పీపీ బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ డైరెక్టర్ రామనాయక్‌కు కృతజ్ఞతలు చెబుతున్న అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారాయణ

అనంతపురం: మూడో అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ధర్మసింగ్ నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'ఆర్టీఐ' చట్టంపై క్విజ్ పోటీలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో కేఎస్ఎన్ కళాశాల సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆర్టీఐ చట్టంపై విద్యార్థులకు కళాశాల స్థాయిలో క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఆరు కళాశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యలత చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ రంగయ్య, ఎన్ఆర్‌సీ కో–ఆర్డినేటర్ రేణుకా దేవి, షఫీ, రామాంజనేయులు, రామానాయుడు ఫర్వీన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాప్తాడు: ఇటీవల విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 10వ జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్‌లో స్థానిక సెయింట్ విన్సెంట్ డీపాల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బండారు నితిషా, మనీష్ నందన్, పూల గౌతమ్ సాయి రెడ్డి రజత పతకం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జ్ఞానమ్మ, హెచ్ఎం అమలా మేరీ తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి పెంపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్

అనంతపురం మెడికల్: బిడ్డ ఎదుగుదలకు తల్లి ముర్రుపాలు దోహదపడుతాయి. కాన్పు అయిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు 5వ సెక్టార్ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్ 1, 2, స్టాలిన్ నగర్ 1, 2 కేంద్రాల్లో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ ఉమా శంకరమ్మ మాట్లాడుతూ.. ఈనెల 7 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.జ్యోతి, అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ఎంఈఓల నియామకంలో వివక్ష తగదు'



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ, ఆపస్ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారి పోస్టుల భర్తీలో ప్రభుత్వం వివక్ష చూపడం తగదని పీఆర్టీయూ, ఆపస్ నాయకులు వాపోయారు. శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేవలం ప్రభుత్వ యాజమాన్య స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓలుగా నియమించారన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లు ఉమ్మడి సర్వీసు ఆధారంగా భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు విన్నవిస్తున్నప్పటికీ ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. సర్వీసులో సీనియర్‌గా ఉన్న పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లను నియమించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆపస్, పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి పాఠశాలల్లో చాక్ డౌన్ కార్యక్రమం చేపట్టి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ, ఆపస్ నాయకులు, చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఎర్రిస్వామి, తిమ్మారెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, పీఎస్పీ నాయుడు, విష్ణువర్ధన్, రామన్న, రమేష్, వరదరాజు పాల్గొన్నారు.

'అమరమ్' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటి ఆవిష్కరణలో పాల్గొన్న అతిథులు

అనంతపురం/అనంతపురం కల్చరల్: గ్రంథాలయ కళా భవనంలో శుక్రవారం తెలుగు వెలుగు సంస్థ 5వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ కవి రాధేయ అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో టీవీ రెడ్డి రచించిన 'అమరమ్' కవితా సంపుటిని ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. త్యాగమయ జీవితాలతో సమాజాన్ని మార్చే క్రమంలో అమరులైన వారికి నివాళిగా సాగిన కవితా సంపుటి అందరూ చదవదగినదన్నారు. సమాజం మాకేమిచ్చిందని కాకుండా.. సమాజానికి మనం ఏమిస్తున్నామని ప్రశ్నించుకుంటేనే ఇలాంటి సాహిత్యం ఆవిర్భవిస్తుందన్నారు. ఉద్దీపన గీతం ఆలపించిన ఎర్రసితార దాసరి ఆదినారాయణ అందరిని తన గాత్రంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో బండి నారాయణ స్వామి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, జనప్రియ కవి ఏలూరు యంగన్న, తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, పోట్లూరి హరికృష్ణ, గ్రంథాలయ కార్యదర్శి రమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడతాం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీట్ల రామకృష్ణ

రాప్తాడు/రాప్తాడురూరల్: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీట్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు గ్రామంలో సీపీఐ నియోజకవర్గ మహాసభ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాల నుంచి చేసిన కార్యక్రమాల గురించి చర్చించడం జరిగిందన్నారు. అలాగే భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యచరణపై చర్చించారు. అనంతరం సీపీఐ రాప్తాడు నియోజకవర్గ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శిగా ఎం.రమేష్, సహాయ కార్యదర్శిగా నీళ్లపాల రామకృష్ణ, అలాగే 19 మందిని కార్యవర్గ సభ్యులు, 33 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. రాప్తాడు మండల కార్యదర్శిగా రవీంద్ర, సహాయ కార్యదర్శిగా చలపతి, అనంతపురం రూరల్ మండల కార్యదర్శిగా నరేష్, సహాయ కార్యదర్శిగా దుర్గా ప్రసాద్, ఆత్మకూరు మండల కార్యదర్శిగా శివను ఎన్నుకున్నారు.

గుంతలను మట్టితో పూడ్చాలి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు నుంచి రామినేపల్లికి వెళ్లేదారి గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ సర్పంచ్ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ.. కందుకూరు నుంచి జంగాలపల్లి మీదుగా బెంగళూరు–హైదరాబాద్ హైవేకు లింకుగా ఉన్న ఈ దారి చాలా అధ్వానంగా ఉందన్నారు. ఈ దారిలో వెళ్లాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కనీసం గుంతలు మట్టితో పూడ్చించి తాత్కాలికంగా ఉపశమనం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోతలయ్య, మల్లేష్, వెంకటస్వామి, శివకుమార్, వెంకటరాముడు, నారాయణ స్వామి, పెద్దన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు సిబ్బందిని నియమించాలి

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ సర్వే కోసం అదనపు సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కోరారు. శుక్రవారం అనంతపురం సబ్ డివిజన్‌లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీ రాజ్ సబ్ డివిజన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణను కలసి సమస్యలు విన్నవించారు. రెండో విడత కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఒక్కొక్కరికి నాలుగైదు వేల ఇళ్ల కేటాయించారన్నారు. నిర్దేశిత గడువులోపు సర్వే ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కొలతలు తీసి ఆన్‌లైన్ చేయాలంటే ఒక్కరి వల్ల అయ్యే పని కాదని పేర్కొన్నారు. పొరుగు సచివాలయాల్లో పని చేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై నియమించాలని కోరారు. ఈ అంశంపై డీఈఈ లక్ష్మీనారాయణ తక్షణం స్పందించారు. ఎంపీడీఓలతో మాట్లాడారు. ఒక్కో పంచాయతీకి ముగ్గురి నుంచి ఐదు మంది వరకు అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న జగన్మోహన్

చెన్నేకొత్తపల్లి: గ్రామాన్ని వదిలి మరో గ్రామంలో చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని నామాల గ్రామానికి చెందిన సంజమ్మ కూలి పనులు చేసుకుంటూ కుమారుడు జగన్మోహన్‌ను చదివిస్తోంది. ఇటీవల విద్యార్థిని పెనుకొండ ప్రభుత్వ వసతి గృహంలో చేర్పించింది. అయితే అక్కడ చదువుకోవడం ఇష్టం లేకపోవడంతో జగన్మోహన్ ఇంటికి వచ్చేశాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు విద్యార్థిని చికిత్స కోసం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గంగన్న సేవలు మరువలేనివి



గంగన్న దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్: విద్యుత్‌శాఖలో అసిస్టెంట్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన గంగన్న సేవలు మరువలేనివని ఎస్పీడీసీఎల్ సీజీఎం ధర్మాజ్జి కొనియాడారు. శుక్రవారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో గంగన్న దంపతులను పూలమాలలతో సన్మానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి శైలజనాథ్ మాట్లాడుతూ.. గంగన్న సుదీర్ఘకాలం పాటు విద్యుత్ శాఖలో పని చేసి అందరి మన్ననలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, విజయవాడ ఎస్ఈ సత్యానంద్, ఉమ్మడి జిల్లా ఎస్ఈలు సంపత్‌కుమార్, శేషాద్రి శేఖర్, డీఈలు, ఏడీలు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో రెచ్చిపోతున్న దొంగలు

- చోరీకి గురవుతున్న బంగారు ఆభరణాలు, నగదు
- పట్టించుకోని త్రీటౌన్ పోలీసులు
- కేసుల నమోదుకు ససేమిరా
- లబోదిబోమంటున్న బాధితులు

- మే 13వ తేదీన అనంతపురం నుంచి శింగనమలకు వెళ్తున్న రమణమ్మ అనే వృద్ధురాలి బంగారు గొలుసు చోరీకి గురైంది. బాధితురాలు తోటి ప్రయాణికుల సహాయంతో బుక్కరాయ సముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. సదరు స్టేషన్ పోలీసులు గొలుసు ఎక్కడ పోయిందని ఆరా తీశారు. బస్టాండ్‌లో చోరీ జరిగి ఉండొచ్చని వృద్ధురాలు చెప్పడంతో నగరంలోని త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లాలని సూచించారు. బాధితురాలు అనంతపురం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించగా.. ఫిర్యాదు స్వీకరించలేదు. బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీ పరిశీలించగా గొలుసు పోయినట్లు తమకు ఎలాంటి ఆధారం కనిపించలేదని పంపించే ప్రయత్నం చేశారు. ఓ ప్రజా ప్రతినిధి సిఫార్సుతో స్టేషన్‌కు వెళ్లినా ఫలితం లేకపోయింది. ఎంపీని కలసి కన్నీటి పర్యంతమైంది. స్పందించిన నేత త్రీటౌన్ సీఐకు ఫోన్ చేయడంతో ఐదు రోజుల అనంతరం కేసు నమోదు చేశారు.



బంగారు గొలుసు పోగొట్టుకున్న రమణమ్మ

- నగరంలోని గౌరవ గార్డెన్‌లో నివాసం ఉంటున్న కళావతి మార్చి 15వ తేదీన భర్త ప్రసాద్, కుమార్తెతో కలసి కదిరికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కే సమయంలో పర్సులో దాచిన మూడున్నర తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. నాలుగు నెలలుగా త్రీటౌన్ పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉంది. నేరుగా సీఐని కలసి కన్నీటి పర్యంతమైంది. కేసు నమోదు చేసేందుకు సీఐ ససేమిరా అన్నారు. 'మీ భర్త నాకు బాగా తెలుసు ఏదైనా రికవరీ అయితే మీ సొత్తు ఇస్తామని చెప్పి పంపించేశారు. నేటికీ కేసు నమోదు కాకపోవడంతో పాటు బాధితురాలికి బంగారు నగలు రికవరీ చేయలేదు.



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్

అనంతపురం క్రైం: దేశాల సరిహద్దులు దాటి చోరీ సొత్తు రికవరీ చేస్తున్న అనంత పోలీసులు.. నగరం నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీలు జరిగితే పట్టించుకోవడం లేదు. కేసుల నమోదులో త్రీటౌన్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బాధితులను త్రీటౌన్ పోలీస్ స్టేషన్ చుట్టూ నెలల తరబడి తిప్పుకుంటున్నారు. కేసుల నమోదు సంగతి పక్కన పెడితే.. ఆభరణాలు, నగదు రికవరీలోనూ పురోగతి చూపించడం లేదు. నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు కోల్పోయిన బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సులతో వెళ్తే పోలీసులు కేసు నమోదు చేస్తున్న పరిస్థితి నెలకొంది. బాధితులు గ్రీవెన్స్‌లో ఎస్పీని కలసి ఫిర్యాదు చేస్తున్నారు. ఎస్పీ త్రీవంగా పరిగణించి కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినా స్థానిక త్రీటౌన్ పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

శ్రావణ లక్ష్మీ పాహిమాం..



అలంకరణలో నసనకోట ముత్యాలమ్మ



కుంకుమార్చన చేస్తున్న మహిళలు



పూజలందుకున్న సీతా దేవి

అనంతపురం కల్చరల్: శ్రావణమాసం రెండో శుక్రవారం నగరంలోని ఆలయాలు భక్తజనసంద్రాలుగా మారాయి. వాడవాడలా జగన్మాత సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకార సేవలందుకుంది. సోమనాథ నగర్‌లోని కోదండ రామాలయంలో సీతా అమ్మవారిని వేదపండితులు గోపాల కృష్ణ మూర్తిశర్మ, మణూరు నాగరాజు ఆధ్వర్యంలో ఉదయం నుండి గాజుల అలంకారంలో శ్రావణ లక్ష్మిగా అలంకరించి పూజించారు. అనంతరం భక్తులకు అమ్మవారి గాజులను వితరణ చేశారు. అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయం, సత్యదేవుని ఆలయంలో అమ్మవారికి విశేషంగా తామర, రోజా పుష్పాలతో అలంకరించారు. అలాగే నగరంలోని చెరువుకట్ట నిముషాంబాదేవి ఆలయం, కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు, రామనగర్‌లోని పెద్దమ్మ తల్లి దేవాలయం, శంకరమఠంలో శారదా మాత, శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి అమ్మవారు పూజలందుకున్నారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ శేఖరబాబు నేతృత్వంలో ముత్యాలమ్మ తల్లి విశేష పూజలందుకుంది. మహిళలు బారులు తీరి సామూహిక కుంకుమార్చనలాచరించారు.